క్లుప్తంగా

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి


టీకాలు వేస్తున్న పశువైద్య వైద్య సిబ్బంది

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని మండల ఉపకేంద్రం పశువైద్యాధికారి ప్రభాకర్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఊరూరుపేట గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు శుక్రవారం నుండి అక్టోబరు 15వ తేదీ వరకు వేస్తామని అన్నారు. టీకాలు వేయించని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడిఆవులకు పాల దిగుబడి తగ్గడం, జర్వం, సోంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసేవలు అందించాలని తెలిపారు.

సమయపాలన పాటించాలి


సచివాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి

కార్వేటినగరం: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యలపై వచ్చేవారు ఇబ్బందులు పడకుండా అందుబాటులో ఉండాలన్నారు. కార్వేటినగరం మేజర్ పంచాయతీ కావడంతో సమస్యలపై ఎక్కువ మంది వచ్చే అవకాశాలు ఉంటాయని, దానికి అనుగుణంగా సిబ్బంది సేవలు అందించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ ఈఓ నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గ్యాస్ డోర్ డెలివరీకి స్వస్తి


క్యూలో ఉన్న వినియోగదారులు

నగరి: పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఇండేన్ గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి డోర్ డెలివరీ అందని ద్రాక్షగా మారిపోయింది. అవసరమైన వారు ఏజెన్సీ కార్యాలయం వద్దకే వచ్చి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో వినియోగదారులు సిలిండర్లతో కార్యాలయం వద్ద బారులు తీరుతున్నారు. ఎండ, వర్షం తేడా లేకుండా క్యూలో నిలబడి సిలిండర్లు తెచ్చుకుంటున్నారు. బుక్‌చేస్తే సిలిండర్లు డోర్ డెలివరీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా అది అమలుకు నోచుకోవడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రానికి దారేది?


పొదల మధ్య నుంచి అంగన్‌వాడీకి వెళ్తున్న చిన్నారులు

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు మండల కేంద్రంలోని హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రానికి దారి లేక పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టుపక్కల చెట్లతోపాటు మురుగు నీటి కాలువల కారణంగా చిన్నారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి, పిల్లల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతోంది. గ్రామస్తులు, తల్లిదండ్రులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రానికి సీసీ రోడ్డు వేయించి, చుట్టుపక్కల చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నగరి: నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో సబ్ స్టేషన్ల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏడీ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరుగుతోన్న పచ్చని గుట్టలు

- చెలరేగిపోతున్న ఎర్రమట్టి గ్రావెల్ మాఫియా
- పంచాయతీల తీర్మానం లేకుండా 5000 హెక్టార్లలో తవ్వకాలు
- గ్రావెల్‌కు అనుమతి ఉందంటున్న మైనింగ్ అధికారులు


ఎర్రమట్టి గ్రావెల్ తవ్వుతున్న హిటాచీలు

పాలసముద్రం: మండలంలోని పచ్చని గుట్టలపై ఎర్రమట్టి గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. గతంలో అనుమతి లేని చోట గుట్టలోని ఎర్రమట్టి గ్రావెల్‌ని తమిళనాడుకు తరలిస్తున్న టిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్లను జరిమానా కట్టి తీసుకెళ్లారు. గురువారం కూడా వనదుర్గాపురం పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలోని గుట్టలో ఎర్రమట్టిని హిటాచి సహాయంతో టిప్పర్లలో తమిళనాడుకు తరలిస్తున్నారు. గ్రావెల్‌కు పంచాయతీ తీర్మానం ఇచ్చింది. మైనింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. దీనిపై మైనింగ్ అధికారులను వివరణ కోరగా పంచాయతీ తీర్మానం లేకుండానే 5000 హెక్టార్ల వరకు రెవెన్యూ అధికారులు ఇస్తే చాలు, మైనింగ్ అధికారులు ఎర్రమట్టి గ్రావెల్ తవ్వకానికి అనుమతి ఇస్తారని చెబుతున్నారు. ఈ సంఘటనలు చూస్తే కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు ఎలాగైనా పచ్చని గుట్టలపై ఎర్రమట్టి గ్రావెల్‌ని దోచుకోవాలని ఉద్దేశంతోనే తవ్వకాలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో అధికారులు అనుమతి ఇచ్చినా టిప్పర్‌లో 21 టన్నుల మట్టిని మాత్రం తీసుకెళ్లాలి. ఈ నిబంధనలను గాలికొదిలేసి 40 టన్నులకు పైగా ఎర్రమట్టిని ఒక్కో టిప్పర్లో తీసుకెళ్తున్నారు. ఎరమట్టి గ్రావెల్‌ను చెన్నై హైవే రోడ్డుకి తీసుకెళ్తామని ఎర్రమట్టి గ్రావెల్ క్వారీ యజమానులు అంటున్నారు. అయితే అది వాస్తవం కాదు వివిధ ప్రాంతాల్లో తమిళనాడుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకుల ఒత్తిడితో ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లకు అనుమతులు లేకపోయినా కూడా రెవెన్యూ, పోలీస్ యంత్రాగం అడ్డుకోవడానికి వెనుకాడుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో పిడికెడు ఎర్రమట్టి తీస్తేనే కేసులు పెట్టి కోర్టుకి తీసుకెళ్తారు. అందుకే ఇక్కడి కూటమి నాయకులు ఎర్రమట్టి గ్రావెల్ మాఫియాను నడిపిస్తున్నారు. ఎలాగైనా తమిళనాడు సరిహద్దుల్లోని పచ్చని గుట్టలను హిటాచీలతో ఎర్రమట్టిని భారీగా తవ్వి, తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నామమాత్రపు అనుమతులతో ఎక్కడ నాణ్యమైన ఎర్రమట్టి ఉంటుందో అక్కడ నుంచి విచ్చలవిడిగా తవ్వి, తరలించేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నడూ లేనివిధంగా తమిళనాడు సరిహద్దుల్లోని గుట్టలను తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం స్పందించి, గ్రావెల్ మాఫియాను అడ్డుకోవాల్సి ఉంది.


ఎర్రమట్టిని తమిళనాడుకు తరలిస్తున్న టిప్పర్

అంతరిక్ష విజయంలో భారత్‌ది పైచేయి


పోస్టర్ ప్రెజెంటేషన్‌లో విద్యార్థులు

నగరి: అంతరిక్ష విజయంలో భారత్‌ది పైచేయి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ రివల్యూషన్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశం అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను, ఆర్యభట్ట ఉపగ్రహం నుండి నేటి వరకు జరిగిన అభివృద్ధిని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.భాస్కర రాజు ప్రస్తుత శాస్త్రీయ పరిస్థితుల్లో స్పేస్ రివల్యూషన్ ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకురాలు ఇందిరా ప్రియదర్శిని అంతరిక్షంలో పంపబడిన లైకా కుక్క వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి, కార్యక్రమ కోఆర్డినేటర్ టి.సుహాసిని అంతరిక్ష సాంకేతికత భూత, వర్తమాన, భవిష్యత్ అంశాలను విశదీకరించారు. విద్యార్థులు 20 పోస్టర్ ప్రెజెంటేషన్లతో స్పేస్ రివల్యూషన్‌పై తమ ప్రతిభను ప్రదర్శించారు. కళాశాల విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శనను వీక్షించారు. అధ్యాపకులు గిరీశ్ కుమార్, అరుణ కుమారి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరాన్ని తిరుపతిలో కలపాలి

– అఖిలపక్ష నాయకుల నిరసన


కార్వేటినగరంలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

కార్వేటినగరం: తిరుపతికి అతి సమీపంలో ఉన్న కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని శుక్రవారం అఖిలపక్ష నాయలు గాండ్లమిట్ట కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతిలో చేర్చి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మండల ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అనంతరం బీజేపీ నాయకుడు యువరాజు మాట్లాడుతూ కార్వేటినగరం పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లు మండల ప్రజలకు బహిరంగంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ రెండు మండలాలు చిత్తూరు జిల్లాలో ఉండడంతో నాన్‌లోకల్ సమస్య తలెత్తుతోందన్నారు. దీనిపై జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కూడా శాసనసభ సమావేశాల్లో గళం విప్పి రెండు మండలాల ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. వైఎస్‌ఆర్ సీపీ, ఇతర పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన

నగరి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0ను రద్దు చేసి పాతపద్ధతినే కొనసాగించాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం నూతనంగా 2.0 సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పెన్‌డౌన్ చేసి, నిరసన వ్యక్తం చేశారు. నూతన విధానాలతో తమ పొట్ట కొట్టవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో అసౌకర్యం కల్గిస్తున్నారని విమర్శించారు. దస్తావేజు లేఖరులకు లైసెన్సులు ఇవ్వాలని, ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. స్లాట్ బుకింగ్, సంతకాలతో పని లేకుండా ప్రభుత్వం కార్డు ప్రైమ్ పేరుతో పొట్టకొట్టవద్దని విజ్ఞప్తి చేశారు. సదరు విధి, విధానాలలో మార్పు అవసరమని సూచించారు. శుక్ర, శనివారాలు పెన్‌డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ రెండు రోజులపాటు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సేవలు అందించమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

భర్త చెంతకు భార్య


డీటీ సమక్షంలో వివాహితను భర్తకు అప్పగిస్తున్న ఎస్‌ఐ

పాలసముద్రం: మండలంలోని బాలక్రిష్టాపురం గ్రామానికి చెందిన సురేంద్ర భార్య పూర్ణిమ అలిగి వెళ్లిపోవడంతో కనబడలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప కేసు దర్యాప్తు చేశారు. ఆమెను వెతికి తిరిగి తీసుకువచ్చారు. శుక్రవారం ఆమె తల్లిదండ్రులు, భర్తకు పూర్ణిమను డీటీ రిషివర్మ సమక్షంలో అప్పగించినట్టు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

తవణంపల్లెలో ఎడతెరపిలేని వర్షం

తవణంపల్లె: మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. తవణంపల్లెలో చిత్తూరు–అరగొండ రోడ్డు దెబ్బతినింది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో శుక్రవారం 42.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. మాధవరం వంక ప్రవహిస్తోంది.


తవణంపల్లెలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

గ్రామీణులకు మెరుగైన వైద్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి జయకుమార్


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

పాలసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంలో స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ కార్యక్రమం తీసుకొచ్చారని వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆముదాల గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ అనురేఖ సమీక్షంలో ఉచిత వైద్య శిబిరం చేపట్టారు. మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి జయకుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం చేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇల్లు, సమాజం బాగుంటాయని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు, క్యాన్సర్, టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, ఆరోగ్యకేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, 104 డీఈఓ శరవణన్ పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని శ్రీరామపురం గ్రామంలో శుక్రవారం స్వస్థ నారీ సశక్తి పరివార్ వైద్యసేవలు అందించారు. కుటుంబమంతా ఆరోగ్యంగా ఉండాలనే ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాలు 17వ తేదీ నుండి అక్టోబర్ 2 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి వినీషా తెలిపారు. ప్రజలు తమ గ్రామంలో జరిగే శిబిరంలో వైద్యసేవలు పొందాలని కోరారు.

మహిళా రైతులకు అవగాహన అవసరం


మాట్లాడుతున్న శాస్త్రవేత్త దివ్యసుధ


కుట్టుమిషన్లు పంపిణీ

పుత్తూరు: సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక వ్యవసాయంపై మహిళా రైతులు అవగాహన పెంచుకోవాలని తద్వారా మంచి లాభాలను ఆర్జించవచ్చునని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్యసుధ సూచించారు. శుక్రవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ(ఆత్మ) చిత్తూరు వారి సహకారంతో వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో గత 32 ఏళ్లుగా కేవీకే వారు చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, రైతు సంఘాల ప్రాముఖ్యత, భూసార పరీక్ష, ఆధారిత ఎరువుల యాజమాన్యం, వ్యవసాయ డ్రోన్స్ వినియోగం, నేల, నీటి సంరక్షణ పద్ధతులు, ఉద్యానవన పంటలు, నూతన రకాలు తదితర అంశాలపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వృత్తి విద్యా శిక్షణ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా రాస్ మహిళా క్రాంతి వారు 20 కుట్టు మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది తేజ్, ప్రకాష్, మునిశేఖర్, మహిళ రైతులు పాల్గొన్నారు.


నీవానది ప్రవాహానికి కొట్టుకుపోయిన దారి

కొట్టుకుపోయిన రోడ్డు

నీవానది ప్రవాహానికి మండలంలోని పలు చోట్ల దారి కొట్టుకుపోయింది. గత ఐదు రోజులుగా పడుతున్న భారీ వర్షాలకు ఎన్టీఆర్ జలాశయం పూర్తిగా నిండిపోయింది. తద్వారా నీరు వదలడంతో నీవానదిలో ప్రవాహం కొనసాగుతూ పరివాహక ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. గంగాధరనెల్లూరు మండలంలోని కలిజ వేడు కొట్రకోన రోడ్డు, ఆత్మకూరు క్రాస్ నుండి ఎస్‌ఆర్‌పేటకు వెళ్లే రోడ్డు నదీ ప్రవాహనికి మట్టితో నిర్మించిన దారి కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఆర్ పేటలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదీ ప్రవాహం పెరిగితే తమ చుట్టుపక్కల గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని, శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. – గంగాధరనెల్లూరు


దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరి మృతి

పుత్తూరు: పట్టణ పరిధిలోని నందిమంగళం గ్రామం వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్కూటరిస్ట్ నగరికి చెందిన టి.పురుషోత్తం(50) తిరుపతి రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 8న పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆటో నడుపుతున్న నగరి మండలం కాకవేడు గ్రామానికి చెందిన కె.రవి గాయపడ్డాడు. ఇతను చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుత్తూరు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు ప్రగతి నిరోధకాలు


బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

పాలసముద్రం: బాల్య వివాహాలు సమాజ ప్రగతికి నిరోధకాలని రియల్ ఎన్‌జీఓ కార్యదర్శి రామారావు తెలిపారు. పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ హేమలత సమక్షంలో విద్యార్థులకు బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ హేమలత మాట్లాడుతూ బాలికలను చిన్నచూపు చూడడం తగదని, వారికి మంచి చదువు, భద్రత ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా బాల్య వివాహం చేయాలని ప్రయత్నిస్తే 10983 లేదా 181కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. బాలికలను విద్యావంతులుగా చేయాలని సూచించారు.

వేణుగోపాలునికి మండల పూజలు


వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని పులికల్లు గ్రామంలో వెలసి ఉన్న శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో శుక్రవారం మండల పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద పండితులు మంత్రోచ్చారణలతో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మండల పూజకు గుణశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణించాలి


రన్నింగ్ రేస్‌ను ప్రారంభిస్తున్న డీవైఈఓ

పుత్తూరు: వ్యక్తిగత ప్రతిభ కనబర్చడానికి అవకాశం ఉన్న అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు విశేషంగా రాణించాలని డీవైఈఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అథ్లెటిక్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, దేనినైనా క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలన్నారు. చదువుతోపాటు క్రీడలు జీవితంలో ఓ భాగం కావాలన్నారు. అనంతరం అన్ని అథ్లెటిక్స్ పోటీల నుంచి ఇద్దరు క్రీడాకారులను డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలరాజు, పాఠశాల హెచ్ఎం ప్రభాకర్‌రాజు, మండల కో–ఆర్డినేటర్ గోపీకృష్ణ, పీడీలు జయప్రకాష్, కేశవులు, సుబ్రమణ్యం, గుర్రప్ప, మోహన్, ఆర్ముగం, శంషుద్దీన్, రాజశేఖర్, పలు పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.